ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
మంగళవారం 2 డిసెంబరు 2025 www.prajaswaramdaily.com 1 pm

# మానవబాంబు పేరిట బెదిరింపు


### ముంబయికి విమానం దారి మళ్లింపు

హైదరాబాద్, ప్రజాస్వరం : మానవబాంబు ఉందంటూ బెదిరింపు రావడంతో కువైట్ నుంచి హైదరాబాద్ వస్తోన్న ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. విమానాన్ని ముంబయికి దారి మళ్లించారు. అర్ధరాత్రి 1:30 నిమిషాలకు విమానం బయలుదేరింది. ఉదయం .8:10 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోవాల్సి ఉంది.




# బంగాళాఖాతంలో భూకంపం

### రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదు




హైదరాబాద్, ప్రజాస్వరం : బంగాళాఖాతంలో మంగళవారం ఉదయం భూమి స్వల్పంగా కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించింది. ఉదయం సుమారు 7:26 గంటల సమయంలో, సముద్ర గర్భంలో 35 కిలోమీటర్ల లోతున ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. ఈ భూప్రకంపనల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని ఎన్‌సీఎస్ తెలిపింది. దీంతో తీరప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా, గత నవంబర్ 21న హిందూ మహాసముద్రం ప్రాంతంలో కూడా ఇదే తరహాలో భూకంపం సంభవించింది. ఆ సమయంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.3గా, 10 కిలోమీటర్ల లోతున నమోదైందని ఎన్‌సీఎస్ తన నివేదికలో పేర్కొంది.

# వాటాదారుల సంతకాలు ఫోర్జరీ

### రూ.39 కోట్ల బదిలీ, ఇద్దరిపై కేసు




హైదరాబాద్, ప్రజాస్వరం : కంపెనీ వాటాదారుల సంతకాలు ఫోర్జరీ చేసి భారీ నగదు షేర్లు బదలీ చేసుకున్న ఉదంతం వెలుగుచూసింది. ఇద్దరు నిందితులపై కేసు నమోదైంది. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి మరికొందరు కలిసి 2014లో నేచర్ బర్న్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేశారు. 2021లో కుత్బుల్లాపూర్‌కు చెందిన వ్యాపారి బండి రామప్రదీప్‌రెడ్డి కంపెనీలో భాగస్వామిగా చేరి 33.33 శాతం వాటాతో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. 2022లో సునీల్ చేరారు. పవన్, రామప్రదీప్, సునీల్ ముగ్గురూ సమాన వాటాలతో డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. ఏపీలోని వివిధ ప్రాంతాల్లో 10 గిగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు 2024 సెప్టెంబరులో ఈ సంస్థ సెరెంటికా రెన్యువబుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక ఒప్పందం చేసుకుంది. ఇందుకు సెరెంటికా సంస్థ ప్రతినిధులతో చర్చించగా రూ.43.5 కోట్లు అదనంగా జీఎస్టీ చెల్లించేందుకు అంగీకరించి అక్టోబరులో రూ.44.63 కోట్లు నేచర్ బర్న్ సంస్థ ఖాతాకు బదిలీ చేసింది. డబ్బు జమయ్యాక.. పవన్‌కుమార్, ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డి వాటాదారుల అనుమతి లేకుండా ఎలెకాన్ ట్రేడింగ్ కంపెనీ ఖాతాలకు రూ. 39.74 కోట్లు బదిలీ చేశారు.

# హిల్ట్‌పై ఎనిమిది నిజనిర్ధారణ బృందాలు

### ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్



హైదరాబాద్: ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీతో కలిగే నష్టాన్ని ప్రజలకు బీఆర్ ఎస్ వివరించనుంది. పారిశ్రామిక వాడల్లో పర్యటించేందుకు 8 నిజనిర్ధారణ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు నేతలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. విలువైన భూములను తక్కువ ధరకు కట్టబెడుతున్నారని బీఆర్ ఎస్ ఆరోపిస్తోంది. మార్కెట్ విలువ కంటే అతి తక్కువ ధరకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. హిల్ట్ పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. బుధ, గురువారాల్లో పారిశ్రామికవాడల్లో పార్టీ బృందాలు పర్యటిస్తాయన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చింది.




# ఒకే రోజు ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్య

హైదరాబాద్, ప్రజాస్వరం : హైదరాబాద్‌లో ఒకే రోజు ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. వేర్వేరు కాలేజీల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు. బాచుపల్లి శ్రీ చైతన్య- వర్ష అనే విద్యార్థి , ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ- విజ్ఞాన్..ప్రగతి జూనియర్ కాలేజీ విద్యార్థి మంజునాథ్ అనే ఇంటర్ విద్యార్థి బలవన్మరణాలకు పాల్పడ్డారు. వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఇమ్రాన్ ఖాన్ మృతి వార్తలు

# రావల్పిండిలో ఉద్రిక్తత

### బుధవారం వరకు 144 సెక్షన్ అమలు



ఇస్లామాబాద్ : పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి వార్తలతో రావల్పిండిలో ఉద్రికత్తలు నెలకొన్నాయి. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మంగళవారం భారీ ర్యాలీకి రంగం సిద్ధం చేశారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని గ్రూపులు రావల్పిండిలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్‌ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి.

# ఐపీఎల్ నుంచి గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఔట్



స్పోర్ట్స్ , ప్రజాస్వరం : 2026 ఐపీఎల్ రోజుకో కొత్త ప్రచారంతో వార్తల్లో నిలుస్తోంది. ఇప్పటికే స్టార్ ప్లేయర్ ఫాఫ్ డూప్లెసిస్ వచ్చే సీజన్‌కు దూరం కానున్నట్లు ప్రకటించగా, ఆల్ రౌండర్ ఆండ్రూ రస్సెల్ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. తాజాగా మరో స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్ వెల్ కూడా ఇదే నిర్ణయం తీసుకున్నాడు. ఈసారి జరగనున్న మినీ వేలంలో తన పేరును నమోదు చేసుకోలేదని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు.



# ఉప్మాలో పురుగులు

### తిన్న 15 మంది విద్యార్థులకు అస్వస్థత

### ఒకరి పరిస్థితి విషమం

గద్వాల , ప్రజాస్వరం జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతిగృహంలో కలుషిత ఆహారం తిని 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఇవాళ ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు యథావిధిగా పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం విద్యార్థులకు వాంతులు కావడంతో.. వారిని ఆస్పత్రికి తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని, ఆ విషయాన్ని వార్డెన్‌కు చెప్పడంతో పారవేశారని విద్యార్థులు తెలిపారు. ఆ తర్వాత అరటిపళ్లు, బిస్కెట్లు తిని స్కూల్‌కి వెళ్లారు. కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులైనట్లు విద్యార్థులు చెబుతున్నారు.




# శ్రీవారిని దర్శించుకున్న స్నేహారెడ్డి

శ్రీవారిని అల్లు అర్జున్ సతీమణి అల్లుస్నేహారెడ్డి మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. దిత్వా తుఫాన్ నేపథ్యంలో వర్షం కురుస్తున్నందున.. గొడుగు పట్టుకొని కనిపించారు.

తిరుమల,ప్రజాస్వరం:

# తల్లి సమాధి వద్దే యువతి



కరీంనగర్ , ప్రజాస్వరం : కరీంనగర్ లో తల్లి సమాధి వద్ద యువతి నిద్రిస్తున్నది. గడిచిన మూడు రోజులుగా తల్లి సమాధి వద్దే ఉంటున్నది. తల్లి మరణాన్ని తట్టుకోలేక తీవ్రమైన డిప్రెషన్లోకి వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పగలూ రాత్రీ తేడా లేకుండా సమాధిని ఆనుకుని నిద్రిస్తున్నది. యువతి భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువతికి రక్షణ , వైద్యం అందించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# హోటళ్లపై మరోసారి ఐటీ దాడులు




హైదరాబాద్, ప్రజాస్వరం : హైదరాబాద్‌లో ప్రముఖ హోటళ్లపై కొనసాగుతున్న ఐటీ దాడులు కొనసాగుతున్నాయి. వుడ్ బ్రిడ్జి హోటల్ యజమాని , బీఆర్ ఎస్ నేత హర్షద్ అలీ ఖాన్‌ను అధికారులు విచారించారు. పిస్తా హౌస్, షాగోస్, మేఫిల్ హోటళ్లపై సోదాలు జరిగాయి. భారీగా నగదు, డాక్యుమెంట్స్ గుర్తించారు. వీరితో సంబంధాలు ఉన్న హోటళ్లపై ఫోకస్ పెట్టారు.

# బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిపై యాసిడ్ దాడి





హనుమకొండ, ప్రజాస్వరం : హనుమకొండలో దారుణం జరిగింది. స్కూటీపై వెళ్తున్నయువతిపై యాసిడ్ దాడికి పాల్పడ్డారు. కాజీపేట మండలం కడిపికొండ వద్ద ఘటన జరిగింది. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న సునంద హనుమకొండ నుంచి వెంకటాపుర్ వెళ్తుండగా.. అడ్డగించి కెమికల్ తో దాడికి దుండగులు యత్నించారు. ఆమె హెల్మెట్ ధరించడంతో ప్రమాదం తప్పింది. కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు.